
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
సోమవారం 16 జూన్ 2025



బల్దియా ఆదాయానికి గండి



- షాపింగ్ కాంప్లెక్సుల్లో బినామీల రాజ్యం
- లీజు ఒకరిపై... నిర్వహణ మరొకరిది
- మున్సిపాలిటీకి నామమాత్రంగా అద్దె చెల్లింపు
- పట్టించుకోని అధికారులు

జగిత్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్సుల అద్దె వ్యవహారంలో రాజకీయ పలుకుబడి ఉన్న కొందరు నాయకులు అధికారులతో కుమ్మక్కై మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. తక్కువ అద్దెకు దుకాణాలను తీసుకొని అధిక అద్దెలకు వ్యాపారులకు ఇచ్చి ప్రతీసంవత్సరం లక్షల రూపాయల ఆదాయం పొందుతున్నారు. కొందరు వ్యాపారులు రెండు, మూడు సంవత్సరాలుగా అద్దెలు చెల్లించకపోయినా మున్సిపాలిటీలో అడిగే నాథుడు కరవయ్యాడు. వారిపై మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.



జగిత్యాల అంగడి బజార్‌లోని షాపింగ్ కాంప్లెక్స్

● ఆదాయం సమకూర్చుకునేందుకు..

జగిత్యాల మున్సిపాలిటీలో ఆదాయ వనరుల కోసం పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో 194 దుకాణాలు నిర్మించారు. జిల్లా కేంద్రంలోని ధర్మపురి బస్టాండు చౌరస్తా వద్ద 62 దుకాణాలు, అంగడి బజార్‌లో 72 దుకాణాలు, మున్సిపల్ పార్కు సమీపంలో 34 దుకాణాలు, ఎంపీడీవో కార్యాలయం సమీపంలో 11 దుకాణాలు, మున్సిపల్ టౌన్ హాలు సమీపంలో 15 దుకాణాల నిర్మాణాలు జరిగాయి.

● రూ.లక్షల్లో అద్దె బకాయిలు

జగిత్యాల మున్సిపాలిటీ ఆదాయం పెంచుకునేందుకు నిర్మించిన కాంప్లెక్స్‌లలో బినామీల రాజ్యం నడుస్తోంది. షాపులను దక్కించుకున్న కొందరు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. లీజు దక్కించుకున్న కొందరు వ్యాపారులు అధికరేట్లకు సబ్ లీజుకు ఇస్తుండగా, మరికొందరు లక్షల్లో బకాయిలు పెడుతూ చెల్లించడం లేదు. షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం జరిగిన సమయంలో లీజు దక్కించుకున్న కొందరు ఏకంగా షాపులను ఇతరులకు సైతం అమ్ముకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు కనీసం కాంప్లెక్స్‌ల నిర్వహణ, అద్దె వసూళ్లు, టెండర్ అంశాలపై శ్రద్ధ చూపడం లేదు. దీంతో మున్సిపల్ కాంప్లెక్స్‌లలో లీజు, సబ్ లీజ్‌దారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇవన్నీ ప్రధాన రహదారి, యావర్ రోడ్డు వెంట వ్యాపారాలకు అనుకూలంగా కట్టించినవే. దుకాణాల కొలతల ఆధారంగా వాటికి అద్దెలు ఖరారు చేశారు. ప్రైవేటు దుకాణాలతో పోలిస్తే వీటి అద్దె చాలా తక్కువగానే ఉంది. ఆయా ప్రాంతాల్లో ప్రైవేటు దుకాణాలకు ఏడాదికి రూ.2 లక్షలు అద్దె, రూ.2లక్షల అడ్వాన్స్ వసూలు చేస్తున్నారు. ఇదే ప్రదేశాల్లో మున్సిపల్ దుకాణాలకు మాత్రం నెలకు సగటున రూ.3వేల నుంచి రూ.4వేల వరకు మాత్రమే వసూలు చేస్తున్నారు. దుకాణాల అద్దెల వ్యవహారంలో బినామీల జోక్యం, అద్దెల్లో వ్యత్యాసాలు, బకాయిల వంటి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులదే హవా..

జగిత్యాల మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లో పలువురు ప్రముఖులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వారి బంధువుల పేర్ల మీదనే...

మిగతా 8లో

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

● 8 మందికి గాయాలు

6

● కోరుట్ల గణపతి విగ్రహ తయారీ కేంద్రం వద్ద ప్రమాదం

కోరుట్ల పట్టణంలో ఆదివారం విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందడంతో విషాదం నెలకొంది. వినాయక విగ్రహ తయారీ కేంద్రంలో విగ్రహాన్ని తోపుడు బండి సహాయంతో మరో షెడ్డుకు తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. నలుగురు క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకుంటానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.


జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

18న మండల స్థాయి క్రీడా పోటీలు

కథలాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 18న మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ లోకిని శ్రీనివాస్ పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థిని, విద్యార్థులు సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించుకోవాలన్నారు. ఈ ఎంపిక 4వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించనున్నట్లు తెలిపారు. 01.09.2016 నుంచి 31.08.2017 మధ్య జన్మించిన వారు అర్హులని చెప్పారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించనున్న పోటీలకు విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్టల సమావేశం

జగిత్యాల క్రైం, జూన్15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని సాంప్రదాయ హోటల్‌లో ఆదివారం జిల్లా కెమిస్ట్అండ్ డ్రగ్గిస్టల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఈసమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్ తదితరులు ఉన్నారు.

సాగుపై అవగాహన

మల్లాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) :గ్రామాల్లో నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో సాగుచేసే పంటల మెళకువలు తెలియజేయడం జరుగు తుందని మండల వ్యవసాయాధికారి లావణ్య అన్నారు. మండలంలోని మొగిలిపేట, చిట్టాపూర్ గ్రామాల్లోని రైతు వేదికలకు వీడియో కాన్ఫరేన్స్‌లు మంజూరైనట్లు ఆదివారం తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమ వారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రైతు భరోసా నిధులు విడుదల కార్యక్రమం మధ్యాహ్నం 3గంటలకు మల్లాపూర్, మొగిలిపేట, చిట్టాపూర్ గ్రామాల్లోని రైతు వేదికల్లో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం జరగనుందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవతం చేయాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

సేవా కార్యక్రమాలతోనే ప్రజల్లో గుర్తింపు

● ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం ● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతోనే ఎవరికైనా ప్రజల్లో గుర్తింపు వస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జాతీయ ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు జగిత్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో ఆవో గావ్ ఛలో కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో వైద్యులు సేవాభావంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు వైద్యులను దైవంతో సమానంగా భావిస్తారని అన్నారు. దాదాపు 10 విభాగాలకు చెందిన వైద్యులు గ్రామానికి వచ్చి ఉచిత పరీక్షలు చేయడం, మందులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో దేశంలో ఏడువేల గ్రామాల్లో ఆవో-గావ్ చలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని రంగాలతో పాటు వైద్య రంగంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. వాటికి తగినట్టు వైద్యులు మారాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్గాం గ్రామాన్ని దత్తత తీసుకొని గ్రామంలో ఏడాది పాటు ఉచిత వైద్యసేవలు అందించడంతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయిం చామని అన్నారు. రోగం వచ్చాక చికిత్స తీసుకోవడం కన్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్ ప్రజలకు సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్, కోశాధికారి సుధీర్, సీనియర్ వైద్యులు పద్మిని, నాగరాజు, రాజశేఖర్, స్వరూప, రజిత, విజయ్, గీతిక, శ్రీధర్, శ్రీనివాస్, నవీన్, శ్రవణ్, పూర్ణచంద్ర, సాయికిరణ్, అర్జున్, ధీరజ్, నాయకులు రవీందర్‌రెడ్డి, శేఖర్, నారాయణ, శ్రీనివాస్, మల్లేశం, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

'ప్రజాపాలనను ఓర్వలేకే కాంగ్రెస్‌పై ఆరోపణలు'

కథలాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సాగుతున్న ప్రజా పాలనను ఓర్వలేకే కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు విమర్శించారు. ఆదివారం కథలాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో దిగజారుడు రాజకీయాలు చేసినందు వల్లే ప్రజలు బీఆర్ఎస్‌ను గద్దె దించారన్న విషయం గుర్తుంచుకోవాలని అన్నారు.

రాష్ట్రాన్ని దోచుకుని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌కే చెల్లిందని ఆయన ఎద్దేవా చేశారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి పథకాలను చూసి ఓర్వలేక చేస్తున్న విమర్శలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు పేర్కొన్నారు. కేటీఆర్‌కు ఇచ్చిన నోటీసులపై రాద్ధాంతం చేయడం తగదని చిత్తశుద్ధి ఉంటే విచారణకు హాజరై నిజాయితీని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అలరించిన కవితా గానం

జగిత్యాల క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కవి ఇంటికి కళాశ్రీ అనే కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు కవులు, కవయిత్రిలు నిరహించిన కవితా గానాలు అలరించాయి. ప్రముఖ కవయిత్రి రుద్రంగి కమలను కళాశ్రీ పురస్కారంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, నిర్వాహకులు అయిత అనిత, మద్దెల సరోజన, రమాదేవి, కవిత, శ్రీలక్ష్మి, లావణ్య, రాధ, రమాదేవి, భాగ్యలక్ష్మి, శ్యాం సుందర్, గంగాధర్, మాణిక్యం, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్


మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను సన్మానిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

జగిత్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాలకు చెందిన ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 జిల్లా సెక్రెటరీ రాంజీనాయక్‌తో పాటు పలువురు ఉద్యోగులు హైదరాబాద్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు విన్నవించారు. విద్యుత్ సంస్థలో పెండింగ్‌లో ఉన్న సమస్యలతో పాటు ఓల్డ్‌పెన్షన్ స్కీమ్, ఆర్టిజన్ల గ్రేడ్ మార్పులు, విద్యుత్ ఉద్యోగుల పదోన్నతి తదితర సమస్యలను విన్నవించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సెల్‌ఫోన్‌లో ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి సమస్యను విన్నవించారు. సాధ్యమైనంత తొందరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జగిత్యాల విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు శంకర్, ప్రకాశ్ నాయక్, కుమారస్వామి, రాజేందర్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లిటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులు సూచించారు. మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ ఆదేశాలతో పట్టణంలోని పలు వార్డుల్లో తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇంటి నుంచి వచ్చే తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు చేసి మున్సిపల్ ఆటోలకు ఇవ్వాలని తెలిపారు. తడి చెత్తను కంపోస్ట్ సెంటర్‌కు తరలించి ఎరువుగా తయారు చేయటం జరుగుతుందన్నారు. పొడి చెత్తను డిఆర్‌సిసి, సెంటర్‌కు తరలిస్తామని అన్నారు. హానికరమైన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, టిఎంసి సోమిడి శివ, ఎండి నిజాం, పట్టణ సమైక్య సంఘం సభ్యులు, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని స్థానిక పురాణిపేట వివేకానంద హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. 1999-2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తమ ఎస్సెస్సీ విద్యాసంవత్సరం పూర్తయి 25ఏళ్లు గడిచిన సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో ఎంఐఎంను గెలిపించాలి'


మాట్లాడుతున్న ఎంఐఎం నాయకుడు గులాం అహ్మద్ హుస్సేన్

జగిత్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థులను గెలిపించాలని ఉమ్మడి జిల్లా ఎంఐఎం ఇన్‌చార్జి సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఖిలాగడ్డ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సేవ చేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు వస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్‌లో అధిక స్థానాల్లో ఎంఐఎంను గెలిపించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలను కలుపుకొని అధిష్టానం ఆదేశాల మేరకు పోటీ చేస్తామని ప్రకటించారు. పార్టీ కౌన్సిలర్లను గెలిపిస్తే ఆయా వార్డులను అభివృద్ధి చేస్తూ దళిత, ముస్లిం, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే స్థానిక ఎన్నికల్లో ఎంఐఎంకు మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం జగిత్యాల పట్టణ అధ్యక్షుడు యునూస్ నదీమ్, కోరుట్ల అధ్యక్షుడు రఫీ, ప్రధాన కార్యదర్శి వాజిద్, మాజీ కౌన్సిలర్ రజియుద్దీన్, నాయకులు సుమేరోద్దీన్, ఆజాద్ నౌమాన్, హాఫీజ్ ఖురేషి పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఆర్డీవో మధుసూదన్


వృద్ధులను సన్మానిస్తున్న ఆర్డీవో మధుసూదన్

జగిత్యాల అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తున్నదని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ అన్నారు. ఆదివారం ప్రపంచ వయో వృద్ధుల వేధింపులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ వృద్ధులను వేధిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని అన్నారు, తల్లిదండ్రులను నిరాదరిస్తే మూడు నెలలకుపైగా జైలు శిక్షతో పాటు జరిమాన విధిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో 26 మంది విశిష్ట వయో వృద్ధులను ఆరుగురు ఉత్తమ కోడళ్లను, కూతుళ్లను, కుమారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వృద్ధుల వేధింపులను అరికట్టేందుకు 2016 సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్లు ఏర్పాటు చేశామన్నారు. అప్పటి నుంచి వృద్ధుల కష్టసుఖాల్లో తాము పాలు పంచుకుంటున్నామన్నారు. తమ అసోసియేషన్ కృషితోనే జిల్లా కేంద్రంలో కోటి రూపాయలతో నిర్మిస్తున్న వృద్ధుల సంరక్షణ కేంద్రం నిర్మాణం పూర్తయితే వృద్ధులకు ఊరట కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సెలింగ్ అధికారి పిసి హన్మంత్ రెడ్డి, బొల్లం విజయ్, ఎండి యాకూబ్, పబ్బా శివానందం, లెల్కుల ప్రభాకర్‌రావు, కోక్కు నారాయణ, గంటేడి రాజ్ మోహన్, బి.రాజేశ్వర్, నక్క ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

హుజూరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూల్ మైదానంలో విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం ఆదివారం గోస్కుల ముత్యంరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2022 నుంచి లీవ్‌లకు సంబంధించి, 2017 ఏరియాస్ పేస్కేల్‌లో రావాల్సిన బకాయిలు ఇప్పటి వరకు రాలేదన్నారు. వెంటనే బకాయిలను యాజమాన్యం ఇవ్వాలన్నారు. జూలై 20న నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రంగు పండరి, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, నర్సయ్య, రఘుపతి, సంజీవ్, నారాయణ, శ్రీను, రవీందర్ పాల్గొన్నారు.

మసీదు కమిటీ ఎన్నిక

జమ్మికుంట రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లి గ్రామ మసీదు కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మహమ్మద్ యాకూబ్, అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ రజాక్, సెక్రెటరీగా మహమ్మద్ సాదిక్, కోశాధికారిగా మహమ్మద్ రహేమాన్, సలహాదారులుగా మహ్మద్ అజ్మీర్, కమిటీ సభ్యులుగా అల్లావుద్దీన్ జాఫర్, చాంద్‌పాషా, రియాజ్, నబిసాబ్, అజీజ్ ఎన్నికయ్యారు.

శరవేగంగా జాతీయ రహదారి పనులు

- కరీంనగర్-వరంగల్ మధ్య కిలోమీటర్ రోడ్డు పనులకు రూ. 37కోట్లు
- 80శాతం పూర్తయిన బైపాస్ పనులు

హుజూరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పనులు శరవేగంగా నడుస్తున్నాయి. గతంలో హుజూరాబాద్ నుంచి కరీంనగర్, వరంగల్‌కు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర అసౌకర్యాలకు గురయ్యేవారు. ప్రస్తుతం పనులు వేగవంతమయ్యాయి. 36 ఏళ్ల క్రితం ఇర్కాన్ సంస్థ నిర్మించిన కరీంనగర్-వరంగల్ రహదారి పూర్తిగా గుంతలమయమైంది. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్-563 నాలుగు వరుసల రహదారికి ఆమోదం తెలిపింది. ఎన్‌హెచ్-563 రహదారి పనులు ప్రస్తుతం వేగంగా నడుస్తున్నాయి. కిలోమీటర్ రహదారి నిర్మాణానికి రూ. 37కోట్లు ఖర్చు పెట్టి పనులు చేస్తున్నారు. కరీంనగర్- వరంగల్ నాలుగువరుసల రహదారి పనుల కోసం కేంద్రప్రభుత్వం సుమారు 16,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేసింది. ఈ రెండు జిల్లాల మధ్య 68 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రహదారి పనులు ఊపందుకున్నాయి. ఈ డిసెం బరు నాటికి రహదారి పనులు పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) సూచించింది. భూసేకరణ అనంతరం రెండేళ్ల నుంచే కరీంనగర్-వరంగల్ సెక్షన్లలో పనులు మొదలయ్యాయి. భూసేకరణలో చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని రెవెన్యూ అధికారులు రైతులతో మాట్లాడి పరిష్కరిస్తున్నారు. శంకరపట్నం మం డలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో టోల్‌గేట్ పనులు చకచకా జరుగుతున్నాయి. కెనాల్ బ్రిడ్జిపై వంతెనలు, కల్వర్టులు, మేజర్, మైనర్ జంక్షన్లు, బైపాస్ రోడ్డు పనులు చేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా ఎత్తయిన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. డ్రైవర్ల విశ్రాంతి కోసం ట్రకవే నిర్మిస్తున్నారు. హుజూరాబాద్, శంకరపట్నం మండలాల నుంచి వాహనాలు రాకతో ఇబ్బందులు అవుతున్నాయనే దృష్ట్యా పట్టణాలకు రాకుండా తాడికల్ నుంచి మొలంగూర్ వరకు ఏడు కిలో మీటర్లు, సింగాపూర్ నుంచి చిన్నపాపయ్యపల్లి వరకు 15కిలోమీటర్లు బైపాస్ నిర్మాణం చేపడుతున్నారు. దాదాపుగా బైపాస్ పనులు 80శాతం వరకు పూర్తయ్యాయి. గ్రామాలు ఉన్న చోట ఇరువైపులా సర్వీస్ రోడ్లను వేస్తున్నారు. గతంలో వరంగల్-కరీంనగర్‌కు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రోడ్డుపనులు శరవేగంగా జరుగుతుండడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు వరకు పనులు పూర్తయితే వరంగల్-కరీంనగర్ మధ్య ప్రయాణం సులభం కానుంది.


కరీంనగర్-వరంగల్ నేషనల్ హైవే


హుజూరాబాద్ శివారులో నిర్మిస్తున్న బైపాస్ బ్రిడ్జి

మా కష్టాలు తీరనున్నాయి..

- పిల్లి సమ్మయ్య, వాహనదారుడు, హుజూరాబాద్



కరీంనగర్, వరంగల్ నాలుగు వరుసల జాతీయ రహదారి పనులు పూర్తయితే మా కష్టాలు తీరుతాయి. ఇప్పటి వరకు 80శాతం వరకు రహదారి బైపాస్ పనులు పూర్తయ్యాయి. గతంలో వరంగల్, కరీంనగర్ రహదారి గుంతలమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. జాతీయ రహదారి పూర్తయితే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

- ఎనిమిది మందికి గాయాలు
- కోరుట్ల
గణపతి విగ్రహ తయారీ కేంద్రం వద్ద ప్రమాదం


అల్వాల వినోద్ (ఫైల్)


సాయికుమార్ (ఫైల్)




సంఘటనా స్థలంలో సొమ్మసిల్లి పడిపోయిన కూలీలు, జగిత్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు, అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కోరుట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో గణపతి విగ్రహాల తయారీ కేంద్రం వద్ద ఆదివారం విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందగా ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో విగ్రహాల తయారీ కేంద్రం నిర్వాహకుడు అల్వాల వినోద్(32), కూలీ సాయికుమార్(29) మృతిచెందారు. కోరుట్ల పట్టణ శివారులో ఉన్న శ్రీబాలాజీ వినాయక విగ్రహ తయారీ కేంద్రంలో భారీ వినాయక విగ్రహాన్ని కేంద్ర నిర్వాహకుడు అల్వాల వినోద్ మరో తొమ్మిది మంది కూలీలతో కలిసి తోపుడు బండి సహాయంతో మరో షెడ్‌కు తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. విగ్రహం తడిగా ఉండడంతో అదే ప్రాంతంలో ఉన్న 33/11 కేవీ లైన్ తగిలి విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో తోపుడు బండి తోస్తున్న వారు విద్యుదాఘాతానికి గురై ఒక్కసారిగా ఎగిరిపడ్డారు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా అల్వాల వినోద్, సాయికుమార్ మృతిచెందారు. మిగిలిన ఎనిమిది మంది కూలీలు అల్వాల నితిన్, వెంకట్‌రెడ్డి, రాజేష్, వేల్పుట్ల సాయికృష్ణ, హన్మంత్, ఆకాష్, రోషన్, హరద్ తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో ఆరుగురిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ ఆసుపత్రులకు తరలించారు. సంఘటనలో గాయ పడిన వారిలో ఇద్దరు ఉత్తరప్రదేశ్, ఇద్దరు మహారాష్ట్రకు చెందిన వారు కాగా మిగతా నలుగురు స్థానికులు ఉన్నారు. క్షతగాత్రులను జగిత్యాల ఆసుపత్రిలో కలెక్టర్ సత్యప్రసాద్ పరామర్శించారు.

● తోపుడు బండికి ఓ చక్రం లేకపోవడంతో ప్రమాదం

భారీ విగ్రహాన్ని తరలిస్తున్న తోపుడు బండికి ఒక వైపు చక్రం లేకపోవడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. తోపుడు బండికి ఒక వైపు చక్రం లేకపోవడంతో పాటు ఆ ప్రాంతం ఎత్తుపల్లాలు ఉండడంతో ఒక్కసారిగా విగ్రహం ఒక వైపు వంగి మీద ఉన్న విద్యుత్ తీగకు తగిలినట్లు విద్యుత్, పోలీసు శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.

● విద్యుత్ లైన్ కిందికి ఉండడంతో..

11/33 కేవీ లైన్ పూర్తిగా కిందికి ఉండడంతో ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న జగ్గాసాగర్, వల్లంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా చేసే లైన్ పూర్తిగా కిందికి ఉండడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది.

● కోరుట్లలో పట్టణంలో విషాదం

కోరుట్ల రూరల్: పట్టణంలోని ప్రకాశం రోడ్డుకు చెందిన అల్వాల వినోద్, ఏసీకోనిగుట్ట ప్రాంతానికి చెందిన సాయికుమార్ మృతి చెందడంతో విషాదం నింపింది. వినోద్‌కు భార్య శైలజతో పాటు ఇద్దరు కూతుర్లు ప్రణయ, శ్రీయాశీలు ఉన్నారు. ఏసీకోనిగుట్ట ప్రాంతానికి చెందిన వెలుల్ల వెంకటి-రేఖ దంపతులకు ఇద్దరు కొడుకులు కాగా పెద్దకుమారుడు సాయికుమార్ ప్రమాదంలో మృతిచెందాడు. చిన్న కుమారుడు సాయికృష్ణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

పట్టణంలో జరిగిన ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు. సంఘటన వివరాలను కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు సురేష్‌బాబు, అనిల్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్, విద్యుత్ ఏడీఈ రఘుపతిని వివరాలను అడిగి తెలుసుకున్నారు.

● క్షతగాత్రులకు పరామర్శ

జగిత్యాల (ఆంధ్రజ్యోతి): క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ సత్య ప్రసాద్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు వేర్వేరుగా పరామర్శించారు. బాధితులకు అందుతున్న చికిత్సను, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడ్డ కృష్ణ, సాయినాథ్, ఆకాష్, హనుమంతు అనే నలుగురిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు బాధితులను జగిత్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

● ప్రమాద వివరాలను తెలుసుకున్న ఎమ్మెల్యే

ప్రమాదంపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఫోన్ ద్వారా పోలీసు అధికారులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్సను అందించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ తరఫున ఎక్స్‌గ్రేషియా అందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

● గాయపడిన వారికి మెరుగైన చికిత్స

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కోరుట్ల, (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో విద్యుదాఘాతానికి గురైన వారికి ప్రభుత్వం తరఫున మెరుగైన చికిత్స అందిస్తామని, మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందే విధంగా చర్యలు తీసుకుంటాని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం కోరుట్ల పట్టణంలో జరిగిన సంఘటనపై మంత్రి ఫోన్ ద్వారా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ప్రమాద ఘటనపై విచారణ జరపనున్నట్లు తెలిపారు.

ఉరివేసుకుని రైతు ఆత్మహత్య


దుద్దెడి శంకర్(ఫైల్)

గంభీరావుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన దుద్దెడి శంకర్(55) అనే రైతు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్ తనకున్న ఐదెకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేశాడు. మరోవైపు రెండు ఎకరాల మామిడి తోట కూడా కౌలుకు తీసుకున్నాడు. ఇటీవలే ఒక కొడుకు పెళ్లి చేశాడు. వరి పంటలో ఆశించిన దిగుబడి రాకపోవడం, మామిడితోటలో నష్టం రావడంతో పాటు అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యాయి. వీటికి తోడు కొడుకు పెళ్లికి చేసిన అప్పుల బాధ ఎక్కువైంది. అన్నీ కలిపి నాలుగు లక్షల రూపాయల వరకు అప్పులు పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన శంకర్ శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. రాత్రంతా శంకర్ కోసం కుటుంబసభ్యులు గాలించారు. పొలం వద్ద చెట్టుకు శంకర్ ఉరివేసుకుని మృతిచెందాడని ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం అందించారు. ఈ మేరకు మృతుడి భార్య పద్మ పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ప్రేమానందం సంఘటన స్థలానికి పరిశీలించి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

కారు, గ్రానైట్ లారీ ఢీ.. నలుగురికి గాయాలు

కరీంనగర్ క్రైం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని తీగలవంతెనపై ఆదివారం వేకువజామున కారు, గ్రానైట్ లారీ ఢీన్న ఘటనలో నలుగురికి గాయాలైనట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సదాశివపల్లి వైపు నుంచి కరీంనగర్‌కు వస్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న గ్రానైట్ లారీని ఢీకొట్టినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయని, స్థానికులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం, కుడి పక్క, లారీ ముందుభాగం ధ్వంసమయ్యాయని, ఘటనపై ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

దొంగిలించిన రాగితీగను పట్టుకున్న రైతులు


వెల్లుల్లలో పట్టుకున్న రాగితీగను అధికారులకు అప్పగిస్తున్న రైతులు

మెట్‌పల్లి రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ రోడ్డులో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించిన రాగితీగను రైతులు ఆదివారం పట్టుకుని అధికారులకు అప్పగించారు. గ్రామంలోని రైతులు పొలం పనులకు సాయంత్రం వెళ్తుండగా నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించిన రాగితీగను సంచిలో ఉంచి ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. రైతులు గమనించి వారిని ప్రశ్నించగా పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో రైతులు వెంబడించగా ద్విచక్రవాహనం, సంచిని వదిలి పారిపోయారు. సంచి పరిశీలించగా దొంగిలించిన రాగితీగ కనిపించగా వెంటనే పోలీసులు, విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. విద్యుత్ ఏడీఏ మనోహర్, ఎస్సై-2 రాజునాయక్‌లు సంఘటన స్థలానికి చేరుకొని రాగితీగ, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న రైతులను అధికారులు అభినందించారు.

అదనపు కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

● మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

శంకరపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగుట్ట గ్రామంలో అదనపు కట్నం కోసం కుటుంబసభ్యుల వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన బిగుల్ల లక్ష్మి-పరుశరాముల కూతురు నవ్య (23)కు శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన ఆడెపు కళ-సమ్మయ్య కుమారుడు సందీప్‌తో 2021లో వివాహం జరిగింది. వివాహ సమయంలో లాంఛనాలతో పాటు లక్షరూపాయల కట్నం కింద సందీప్‌కు అప్పగించారు. పెళ్లి అయిన తర్వాత మొదటి కుమారుడి ఆస్పత్రి ఖర్చులు తల్లిగారు భరించారు. కాగా కొంతకాలం తర్వాత రూ. 50వేలు అదనపు కట్నం కావాలని అడగగా నవ్య పుట్టింటి వారు ఇచ్చారు. రెండో కుమారుడు జన్మించిన తర్వాత కూడా అదనపు కట్నం కోసం వేధించడంతో మరొక రూ. 50వేలు అందించినట్లు తెలిపారు. కొంతకాలం తర్వాత రెండు లక్షల అదనపు కట్నం కోసం వేధించడంతో నవ్య తన కుమారులతో మెట్‌పల్లికి వెళ్లింది. ఈ నెల 13న సందీప్ ఫోన్ చేసి ఇక నుంచి మంచిగా ఉంటానని చెప్పడంతో నవ్య కుటుంబసభ్యులు వారి కుమారుడు హర్షవర్ధన్‌తో నవ్యను అత్తారింటికి బస్సు ఎక్కించి పంపించారు. నవ్య చేరిన విషయం తెలుసుకోవడానికి సందీప్‌కు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని తెలిపారు. ఈ నెల 14న రాత్రి రెండో అల్లుడు బూర్ల వంశీకి ఫోన్ చేసి నవ్య ఉరేసుకుందని కరీంనగర్ సివిల్ ఆస్పత్రిలో చనిపోయిందని సందీప్ సమాచారం అందించాడు. కాగా శనివారం నవ్య అదనపు కట్నం వేధింపులు భరించలేక ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా అత్తింటి వారు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించి, నవ్య మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. నవ్య మృతిపై అనుమానాలు ఉన్నాయని, తగిన విచారణ చేపట్టి న్యాయం చేయాలని తల్లి లక్ష్మి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

మతిస్థిమితం సరిగా లేక మహిళ బలవన్మరణం

గొల్లపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపేట గ్రామంలో మతిస్థిమితం సరిగా లేని మహిళ ఓ వ్యవసాయ బావిలో దూకి ఆదివారం బలవన్మరణానికి పాల్పడింది. బాధిత కుటుంబసభ్యులు, ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్కాకుల లక్ష్మి (49) అనే మహిళ కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయింది. కుటుంబసభ్యులు పలు ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు చేయించినా జబ్బు నయం కాలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన లక్ష్మి జీవితం మీద విరక్తి చెంది గ్రామ రెవెన్యూ పరిధిలోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు లక్ష్మి భర్త రాజమల్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


విచారణ జరుపుతున్న ఎస్సై సతీష్ కుమార్

రాజన్న ఆలయ ఈవో కార్యాలయం ఎదుట ఆందోళన

- వేధింపులతోనే కొడుకు మృతిచెందాడని ఆరోపణ

వేములవాడ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తించే ఇద్దరు అధికారుల వేధింపులతోనే తన కొడుకు మృతిచెందాడని మృతుడి తల్లి పెంట లక్ష్మి బంధువులు, కాలనీవాసులతో కలిసి ఈవో కార్యాలయం ఎదుట ఆదివారం ఆందోళన నిర్వహించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో ఇంజనీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న పెంట ఓంకార్ (30) 15 రోజులు క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంజనీరింగ్ విభాగంలోని ఓ ఉద్యోగి తన సొంత పనులకు ఓంకార్‌ను వాడుకున్నారని, మరో ఉద్యోగి ఓంకార్‌ను విధులకు రావడం లేదని గైర్హాజర్ వేసి ఉద్యోగం నుంచి తొలగిస్తామని వేధించారన్నారు. అంతేకాకుండా రాతపూర్వకంగా క్షమాపణ పత్రం రాయించుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఓంకార్ మే 30వ తేదిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

దీంతో మృతుడి తల్లి ఆదివారం ఈవో కార్యాలయం ఎదుట బంధువులు, కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఆలయాధికారులు అక్కడకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి ధర్నా విరమించారు.


ఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఓంకార్ బంధువులు, కాలనీవాసులు

వేములవాడలో కూల్చివేతలు ప్రారంభం

- రోడ్ల వెడల్పులో భాగంగా నిర్మాణాల తొలగింపు
- మెయిన్ రోడ్డులో 144 సెక్షన్ అమలు

వేములవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు వెడల్పు ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాల తొలగింపు చేపట్టారు. రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ముందుభాగం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 80 అడుగుల మేరకు విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు, ఇందుకోసం రోడ్డుకు ఇరువైపులా సేకరించాల్సిన ఇళ్లు, భవనాలను గుర్తించారు. 240 మందికి పైగా నిర్వాసితులుగా గుర్తించిన ప్రభుత్వ యంత్రాంగం 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇప్పటికే 60 మందికి పరిహారం చెల్లించింది.

కొందరు రోడ్ల వెడల్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా వారికి సంబంధించిన చెక్కులను అధికారులు కోర్టులో డిపాజిట్ చేశారు. రోడ్ల వెడల్పుల్లో నష్టపరిహారం కోసం 47 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేయగా, సాధ్యమై నంత త్వరలో రోడ్ల వెడల్పు ప్రారంభించాలన్న లక్ష్యంతో ఆదివారం తొలు త స్థానిక పుర పాలక సంఘానికి చెందిన మటన్ మార్కెట్ ప్రాంగణాన్ని ఎక్స్‌కావేటర్ సహాయంతో అధికారులు కూల్చివేశారు. ప్రధాన రోడ్డు వెంబడి రాజరాజేశ్వరస్వామి దేవస్థానం సంబంధించిన వాణిజ్య సముదా యం ఉండగా దానిని సోమవారం కూల్చివేయనున్నారు. సోమవారం ఉదయం నుంచి మూడు నాలుగు రోజుల్లోగా రోడ్డుకు ఇరువైపులా సేకరించిన భవనాలను కూల్చివేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇళ్లు, భవనాలు ఖాళీ చేయాల్సిందిగా ఇప్పటికే యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు చాలామంది తమ ఇళ్లను ఖాళీ చేయకపోవడంతో సోమవారం తెల్లవారుజాము వరకు ఖచ్చితంగా ఖాళీ చేయాలంటూ అధికారులు ఆదివారం స్పష్టం చేశారు. లేనిపక్షంలో తామే బలవంతంగా తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు.

రోడ్ల వెడల్పులో భాగంగా కూల్చివేతల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు రాజన్న ఆలయం ముందు భాగం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు సోమవారం ఉదయం నుంచి 144 సెక్షన్ విధిస్తూ తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు. రోడ్ల వెడల్పులో సేకరించిన ఇళ్ల భవనాలకు కూల్చివేతకు సంబంధించిన పనులు పర్యవేక్షించేందుకు పలు బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే తాము ఇళ్ల ఖాళీ చేయకముందే బలవంతంగా కూల్చివే తకు సిద్ధం కావడం సరైనది కాదని, ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా నిర్వహి స్తున్న దుకాణాలను, వాటిలోని సామగ్రిని తరలించడానికి కొంత సమ యం ఇవ్వాలని వ్యాపారులు కోరుతున్నారు.


మెయిన్ రోడ్డు వద్ద గుమిగూడిన స్థానికులు

సమైక్య సాహితి పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో జీవీ శ్యాంప్రసాద్‌లాల్ తదితరులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫిలిం భవన్‌లో ఆదివారం సమైక్య సాహితి తరఫున నాన్నల విశిష్ట పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల విద్యా సంస్థల జాయింట్ సెక్రెటరీ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ నాన్న కుటుంబానికి మార్గదర్శి అని, పిల్లల సంపూర్ణ శారీరక, మానసిక, నైతిక మూర్తిమత్వానికి ఆయన ప్రధాన కారకుడని అన్నారు. జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ప్రదాతగా ఆచార్య రజనీశ్రీ నృత్య పురస్కారం డాక్టర్ పేరిణి కుమార్‌కు, కేఎస్ అనంతాచార్య ప్రదాతగా కలకుంట్ల సంపత్కుమారాచార్య సంగీత పురస్కారం లక్ష్మీ శేషాచార్యులకు, రావికంటి శ్రీనివాస్ ప్రదాతగా రావికంటి రామయ్యగుప్త సాహితీ పురస్కారం డాక్టర్ వరుల రంగాచార్యకు, మాడిశెట్టి గోపాల్ ప్రదాతగా మాడిశెట్టి మల్లయ్య ఉపాధ్యాయ పురస్కారం బెజ్జారపు వినోద్‌కుమార్‌కు, డాక్టర్ రఘురామన్ ప్రదాతగా డాక్టర్ దారం నాగభూషణం పరిశోధక పురస్కారం ఆచార్య అడపా సత్యనారాయణకు అందజేశారు. ఒక్కొక్కరికి పురస్కారం కింద శాలువా, ప్రశంసాపత్రం, 5వేల రూపాయల నగదు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్, ప్రధానకార్యదర్శి కెఎస్ అనంతాచార్య, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ కలువకుంట రామకృష్ణ, కొత్త అనిల్‌కుమార్, డాక్టర్ టీవీఎస్ స్వామి, గాజుల రవీందర్, అనుప, డాక్టర్ శ్రీనివాసాచార్య, నాగేంద్రశర్మ, సుజనాదేవి పాల్గొన్నారు.

● సమైక్య సాహితి పురస్కార కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ తాను స్వీకరించిన ఉత్తమ ఫిల్మ్ క్రిటిక్ గద్దర్ అవార్డు కరీంనగర్ ప్రజలకు అంకితం ఇస్తున్నట్లు తెలిపారు.

సాహిత్యంలో రాణిస్తున్న అనూశ్రీ

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు



కవయిత్రి గౌరోజు అనూశ్రీ

కోల్‌సిటీటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గౌరోజు అనూశ్రీ పలు రచనలు చేస్తోంది. కవితా సంపుటి, సంకల నాలతో సాహిత్య రంగంలో తన కంటూ ప్రత్యేకతను చాటు కుం టూ ఎన్నో కవితలు, కథలు, గేయాలు, సమీక్షలను రాసింది. పలు పురస్కారాలు అందు కుం టూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సంపాదించింది. అసలు పేరు కృపారాణి. ఆమె కలం పేరు అనూశ్రీ. నాన్న పొడిశెట్టి బిక్షపతి సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. భర్త రవీంద్రాచారి స్వర్ణకార వృత్తి. కృపారాణి(అనూశ్రీ)కి చిన్ననాటి నుంచి సాహిత్యంపై మక్కువ. తండ్రి బిక్షపతిచారి సింగరేణిలో కార్మికుడిగా పనిచేస్తూనే శ్రామికులు, శ్రమశక్తిపై అనేక పాటలు రాసే వారు. మేనమామ నాగభూషణం కూడా సాహితీవేత్త. అలా అనూశ్రీ సాహిత్యమంటే ఇష్టంగా మారింది. గృహిణిగా ఉంటూనే ఎన్నో కవితలు, రచనలు చేస్తున్నది.



అనుశ్రీ రాసిన గగనం పుస్తకావిష్కరణ చేస్తున్న సుద్దాల అశోక్‌తేజ్

● వచనకవితలు... రచనలు...

అనూశ్రీ కలం నుంచి ఎన్నో కవితలు, రచనలు జాలు వారాయి. ఇప్పటి వరకు సుమారు 3వేలకు పైగా వచన కవితలు, 60కథలు, 6 నవలలు, 300 సమీక్ష రచనలు చేశారు. 2020లో కెరటం తొలి(కవితా సంపుటి), 2021లో తేనెపలుకు(సరళ శతకం), 2022లో గగనం(కవితా సంపుటి), 2022లో దోసిట్లో చందమామ(భావ కవిత్వం), 2022లో శ్రీపద సౌరభం(శ్రీపద సకలనం), 2023లో వేద నవల, 2024లో జగతి నవల ప్రశంసలు అందుకున్నాయి. అలాగే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో మూడుసార్లు చోటు దక్కింది.



అనూశ్రీకి సత్కారం

● ఎన్నో అవార్డు... ప్రశంసలు

అనూశ్రీ కలం నుంచి జాలువారిన కవితలు, రచనలు, సమీక్షలకు ఎన్నో పురస్కారాలు లభించాయి. సాహిత్యరత్న, సాహిత్య సవ్వడి, కవితారత్న, కవితా భూషణ, కవితావిభూషణ, కవిచక్ర, సాహిత్య ప్రవీణ్య, కవిశ్రేష్ట, కవి మిత్ర, సహస్ర కవికిరణం, సాహితీభూషణం తదితర బిరుదులు, తెలుగు వెలుగు పురస్కారం అందుకున్నారు. తొలి పుస్తకానికి అంగలకుదుటి పురస్కారం, గిడుగు రామమూర్తి పురస్కారం, లింగుట్ల లక్ష్మీనరసమ్మ పురస్కారం, చంద్రబోస్ జీవిత సాఫల్య పురస్కారంతోపాటు అనేక చిత్ర, కవితల పోటీల్లో బహుమతులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. గృహిణి బాధ్యతలను కొనసాగిస్తూనే తనకిష్టమైన సాహిత్యరంగంలో రాణిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు... గౌరోజు కృపారాణి(అనూశ్రీ).

దోస్త్ మూడో దశ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

గణేశ్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి దోస్త్ మూడో దశ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతుందని దోస్త్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో దశ సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యిందని, ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో దశలో సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 18లోగా దోస్త్ వ్యక్తిగత లాగిన్‌లో సెల్ఫ్ రిపోర్ట్ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొన్నారు. సెల్ఫ్‌రిపోర్ట్ చేయకపోతే సీటు, రిజిస్ట్రేషన్ రద్దు అవుతుందని తెలిపారు. ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాల నాక్ చేత 'ఏ' గ్రేడ్ గుర్తింపు పొందినట్లు, స్వయం ప్రతిపత్తితో కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో అత్యధిక విద్యార్హతలు, అపార అనుభవం ఉన్న అధ్యాపకులతో విద్యాబోధన సాగుతోందని తెలిపారు.

అత్యాధునిక వసతులతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్‌ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాల ఆవరణలో విద్యార్థినులకు వసతి సౌకర్యం కలదని, చాలా మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందారని తెలిపారు. అధునాతన సబ్జెక్టులతో కూడిన కోర్సులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఎస్సారార్ కళాశాలలో అడ్మిషన్ తీసుకొని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు.

నేడు ముల్కనూర్ బ్యాంకు ఎన్నికలకు నామినేషన్లు

- ఐదు డైరెక్టర్ స్థానాలకు పోటీ

భీమదేవరపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు ఐదు డైరెక్టర్ స్థానాల ఎన్నికలకు సోమవారం నామినేషన్లు వేయనున్నారు. ఇందుకోసం మే 24న ఎన్నికల అధికారి కోదండరాములు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ముల్కనూర్ బ్యాంకులో మొత్తం 15 డైరెక్టర్ స్థానాలు ఉండగా, అందులో ప్రతీ 20 నెలలకు ఒకసారి రొటేషన్ పద్ధతిలో ఐదు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఇందులో 1, 5, 9 వార్డులు ఇతరులకు, 2వ వార్డు ఎస్సీ, 15వ వార్డు మహిళలకు కేటాయించారు.

సోమవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు వేయనున్నారు. 17న నామినేషన్ పత్రాల పరిశీలన, 18న నామినేషన్ పత్రాల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం గుర్తుల కేటాయింపు జరుగుతుంది. ఓసీలకు రూ.వెయ్యి, బీసీలకు రూ.750, ఎస్సీ ఎస్టీలకు రూ.500ల చొప్పున నామినేషన్ రుసుము చెల్లించాలి. ఈనెల 27న ముల్కనూర్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరగనున్నట్లు ఎన్నికల అధికారి కోదండరాములు తెలిపారు.

కిటకిటలాడిన ఆలయాలు.. భక్తుల పూజలు





వేములవాడలో రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, ధర్మపురిలో లక్ష్మీనర్సింహస్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రాజన్న ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకుని తరించారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం తీసి మొక్కులు చెల్లించుకున్నారు.

ధర్మపురి, (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి, గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. భక్తులు కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు, సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సేవలో న్యాయాధికారి



కొండగట్టులో జడ్జిని ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

మల్యాల (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లా జిల్లా మొదటి అదనపు సెసన్స్ జడ్జి పుష్పలత ఆదివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చిన న్యాయాధికారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంత్ రావు, సిబ్బంది పాటు ఏఎస్సై చిలుక శ్రీనివాస్ ఉన్నారు.

బోనమెత్తిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ముత్యంపేటలో మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట ఎస్సీ కాలనీలో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. బోనం ఎత్తుకొని మహిళలతో కలిసి ఊరేగింపుగా పోచమ్మ ఆలయం వద్దకు వెళ్లారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మ్యాక లక్ష్మణ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, దారం ఆదిరెడ్డి, ముత్యం శంకర్‌గౌడ్, శనిగారపు తిరుపతి, సంత ప్రకాష్‌రెడ్డి, హరినాథ్, పొన్నం సాయి, నాగులపేట సంజీవ్, అనిల్, వెంకటేష్, బండి రవి, మనోజ్ పాల్గొన్నారు.

వేములవాడకు చేరుకున్న మంత్రి 'అడ్లూరి'

- నేడు రాజన్నను దర్శించుకోనున్న మంత్రి

- స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మంత్రి అడ్లూరికి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం రాత్రి చేరుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన మంత్రికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆదివారం రాత్రి ఆలయ గెస్ట్‌హౌస్‌లో బసచేసి సోమవారం ఉదయం రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకోనున్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఇన్‌చార్జి ఈవో రాధాబాయి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

వైభవంగా పెద్దమ్మ బోనాలు

కొడిమ్యాల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల గ్రామంలో ముదిరాజు కులస్తులు ఆదివారం సాయంత్రం పెద్దమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ముదిరాజు కుల మహిళలు కుటుంబ సభ్యులతో, బంధువులతో ఇంటికొక్క బోనంతో మహిళలు గ్రామ కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి నెత్తిన బోనాలను ఎత్తుకొని గ్రామ శివారులో ఉన్న పెద్దమ్మ ఆలయానికి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని కోరుకుంటు పెద్దమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి, మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం నాయకులు, సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మ బోనాలను నిర్వహించారు. మహిళలు బోనాలను అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు.

గంగాధర: గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి, ర్యాలపల్లిలో ఆదివారం ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో పెద్దమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామాల తాజా మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

కొడిమ్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దళిత సంఘాల కులస్తులు ఆదివారం సాయంత్రం పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దళిత కుల సంఘాల మహిళలు కుటుంబ సభ్యులతో, బంధువులతో ఇంటికొక్క బోనంతో గ్రామంలోని కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుండి నెత్తిన బోనాలను ఎత్తుకొని గ్రామ శివారులో ఉన్న పోచమ్మ ఆలయానికి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి, మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కుల సంఘం నాయకులు కొత్తూరి స్వామి, దేవయ్య, అజయ్, చిట్యాల స్వామి, నరేష్, శేఖర్, చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేష్, సభ్యులు, ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోపూజ

కొడిమ్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పల్లకి సేవ, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు ఆలయ పూజారి నాగరాజు రమేష్ నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేశం, సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు

వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్

- గర్రెపల్లిలో సీనియర్స్ వాలీబాల్ పోటీలు



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

సుల్తానాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్స్ వాలీబాల్ పోటీలు సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించారు.

జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారుడు కన్న రమేష్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని నలభై ఐదేళ్ల వయస్సు పైబడిన వాలీబాల్ క్రీడాకారులతో కలిసి పోటీలు నిర్వహించగా పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి రెండు వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతీ ఏటా ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్స్ వాలీబాల్ క్రీడాకారులకు పోటీలను గర్రెపల్లిలో నిర్వహిస్తున్నామని ఇది ఐదోసారి అని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆసంపల్లి శ్రీనివాస్, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పడాల అజయ్ తదితరులు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కనబరిచేలా చూడాలన్నారు. వాలీబాల్ క్రీడకు ఉమ్మడి జిల్లాలో గర్రెపల్లి గ్రామం కీలకంగా ఉందన్నారు. కాగా ఈ పోటీల్లో విజేతగా కరీంనగర్ జిల్లా జట్టు నిలువగా రెండో స్థానంలో జగిత్యాల జిల్లా జట్టు నిలిచింది. కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు సీవి విజ్ఞాన్ రావు, జూపల్లి తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కళాకారులు

- ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలి

- కళాభారతిలో 'పాటల పల్లకిలో 12 గంటలు'





పాటలు పాడుతున్న గాయని తేలు విజయ, కళాకారులు, సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

కరీంనగర్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కళాకారులు కదం తొక్కారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. రచయిత, గాయకుడు నేర్నాల కిషోర్, టీపీసీసీ సాంస్కృతిక సేన అధ్యక్షుడు చక్రాల రఘు ఆధ్వర్యంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి హాజరైన కళాకారులు కరీంనగర్ కలెక్టరేట్ నుంచి ర్యాలీగా కళాభారతి చేరుకున్నారు. సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కళాభారతిలో కిషోర్, రఘు మాట్లాడుతూ సాంస్కృతిక సారథి సంస్థలో అసలైన కళాకారులకు న్యాయం జరుగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా సీఎం రేవంత్‌రెడ్డి కళాకారులను ఆదుకోవాలని, ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఉద్యమం పుట్టింది కరీంనగర్‌లోనేనని, అందుకే రాత్రి 10 గంటల వరకు 'పాటల పల్లకిలో 12 గంటలు' (ధూం...ధాం) కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. అంతకు ముందు అతిథిగా హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు న్యాయం చేస్తుందన్నారు. నాడు ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారన్నారు. అనంతరం కళాకారుల ఆటాపాటలు ఆలోచింపజేయడంతో పాటు అలరించాయి. సీనియర్ కళాకారులు మురళి మధు, వడ్లకొండ అనిల్‌కుమార్, ఆకునూరి దేవయ్య, బుర్ర నటరాజ్, శాంతిరాజ్, తేలు విజయ, ఏపూరి సోమన్న, వొల్లాల వాణి, జడల రమేష్, పొద్దుపొడుపు శంకర్, శంకర్‌బాబు, గుండేటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

కిరణ్‌కుమార్, కొడిమ్యాల తహసీల్దార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: భూ భారతి గ్రామ సభల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు ఏంటి?

తహసీల్దార్: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయి. ఆన్‌లైన్ రికార్డులతో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

ఆంధ్రజ్యోతి: భూ భారతి గ్రామ సభలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

తహసీల్దార్: ఇప్పటి వరకు నిర్వహించిన భూ భారతి గ్రామ సభలకు 446 దరఖాస్తులు ప్రజల నుంచి వచ్చాయి.

ఆంధ్రజ్యోతి: భూ భారతి గ్రామ సభలకు రైతుల స్పందన ఎలా ఉంది ?

తహసీల్దార్: ప్రతి గ్రామంలో రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులను అందిస్తున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.

-కొడిమ్యాల

బల్దియా ఆదాయానికి గండి

(5వ పేజీ తరువాయి..)

ఈ లీజుకు సంబంధించిన పేర్లు ఉన్నట్టు సమాచారం. కాలక్రమేనా లీజు దారులంతా వేరే వారికి సబ్ లీజుకు ఇస్తూ వారినే కిరాయి దారులుగా రికార్డుల్లో కొనసాగిస్తున్నారని సమాచారం. అసలు ఎవరికీ లీజు ఇచ్చారు, వారు ఎక్కడ ఉన్నారు.. అనే వివరాలు కూడా అందుబాటులో లేకపోవడం చేస్తే మున్సిపల్ కాంప్లెక్స్‌పై అధికారుల పర్యవేక్షణ ఇట్టే అర్థం అవుతోంది. సాధారణ వ్యక్తులు ఖాళీగా ఉన్న రూమ్‌లు కిరాయికి అడిగితే కౌన్సిల్ తీర్మానం, ఇతర నిబంధనలు అంటూ సవా లక్ష కారణాలు చెప్పే అధికారులు, లీజు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎంత మంది కొత్త వారికి కౌన్సిల్ తీర్మానంతో గదులు కేటాయించారనే వ్యవహారంపై దృష్టి సారించడం లేదు. మున్సిపల్ ఆదాయానికి లీజుదారులతో పాటు అధికారులు గండి కొడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● మున్సిపాలిటీ పరిధిలో 194 దుకాణాలు

ప్రతి ఏడాది మున్సిపాలిటీకి రూ.కోట్లలో అద్దె రావాల్సి ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో రూ.లక్షల్లో మాత్రమే వస్తోంది. సరాసరి నెలకి ఒక షటర్‌కు రూ.10 వేలు అద్దె వేసుకున్నా సుమారు 194 షెటర్లకు నెలకు రూ.19.4 లక్షల ఆదాయం రావాల్సి ఉంది. కానీ ఏడాదికి కనీసం రూ.కోటి కిరాయి కూడా వసూలు కావడం లేదని తెలుస్తోంది. ఒక షాపు కిరాయి అయితే రూ.800లకే ఇచ్చినట్లు సమాచారం. మున్సిపల్ కిరాయి రూ.5 వేల నుంచి రూ.8 వేలు ఉండగా దాన్ని దక్కించుకున్న లీజ్‌దారులు సబ్ లీజ్ దారులకు రూ.20 వేల నుంచి రూ. 30 వేలకు కిరాయి ఇచ్చుకుంటూ మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.



జగిత్యాల పాత బస్టాండు చౌరస్తాలోని షాపింగ్ కాంప్లెక్స్

● టెండర్లు నిర్వహించకుండానే..

పట్టణంలోని పలు ప్రాంతాల్లో గల మున్సిపల్ దుకాణాలకు టెండర్లకు నిర్వహించకుండానే అద్దెకు ఇస్తున్నారు. సుమారు 20 సంవత్సరాల క్రితం నిర్వహించిన టెండర్ ద్వారానే ఇప్పటికీ అద్దెలు వసూలు చేస్తున్నారు. యేటా అద్దెను 33.33 శాతం పెంచుతూ పోతున్నారు. కానీ టెండర్లు మాత్రం నిర్వహించడం లేదు. షాపింగ్ కాంప్లెక్స్‌లకు మళ్లీ టెండర్లు నిర్వహిస్తే మున్సిపాలిటీకి రూ. కోట్లలో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. గతంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అతితక్కువ ధరలకే టెండర్లలో దుకాణాలు దక్కించుకొని వాటిని సబ్ లీజుకు ఇస్తూ అధిక ఆదాయం పొందుతున్నారన్న ఆరోపణలున్నాయి. సబ్ లీజ్ తీసుకున్న వ్యాపారులు లీజ్‌దారులకు కిరాయి ప్రతీ నెల చెల్లిస్తున్నా వారు మాత్రం మున్సిపాలిటీకి సక్రమంగా అద్దె చెల్లించడం లేదని సమాచారం. క్షేత్ర స్థాయిలో అధికారులు విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారి వద్ద నుంచి షెటర్లను స్వాధీనం చేసుకొని రీ టెండర్ వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే..

-ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు



భవానినగర్‌లో బురదయంగా రోడ్డు

జగిత్యాల అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు కాలనీలు కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. దీంతో రోడ్డుపై వెళ్లే వారికి ఇబ్బంది కరంగా మారాయి. పట్టణంలో చాలా మట్టుకు సీసీ రోడ్లు వేసినప్పటికీ మురికి కాలువ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం లోని భవాని నగర్‌లో ఇటీవల నిర్మించిన రోడ్డు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వలన నీరు చేరి నడవడానికి కూడా వీలు లేకుండా పోయింది. వర్షాకాలం అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి తమ రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కొడిమ్యాల వైద్యుడికి అవార్డు

కొడిమ్యాల, జూన్15(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన డాక్టర్ పర్లపెల్లి జితెందర్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ చేతుల బెస్ట్ డాక్టర్ అవార్డును అందుకున్నారు. ప్రస్తుత్తం కరీంనగర్ పట్టణంలోని సివిల్ ఆసుపత్రిలో జనరల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పలు ప్రభుత్వ ఆసుపత్రులలో సుమారు దశాబ్ద కాలంగా 6వేల పైచిలుకు మందికి ఆపరేషన్లను చేసి ఎంతో మందికి ప్రాణదాతగా నిలిచినందుకు ప్రభుత్వం బెస్ట్ డాక్టర్ అవార్డును ప్రకటించి అందించినట్లు జితెందర్ విలేకరులకు తెలిపాడు. జితెందర్ బెస్ట్ డాక్టర్ అవార్డు అందుకోవటం పట్ల మండల ప్రజలు, నాయకులు అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

ఇబ్రహీంపట్నం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపికైన లబ్దిదారులకు ఆదివారం యామపూర్ గుడేటి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇళ్ల మంజూరి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఏమాత్రం అభివృద్ధి చేయకపోగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, మిషన్ భగీరథ పథకంలో అవినీతి, ఆడబిడ్డలు కట్టుకునే బతుకమ్మ చీరలు కూడా అవినీతి చేశారని, ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని అలాగే వర్కింగ్ జర్నలిస్టుకు ఇళ్లు మంజూరు చేస్తామని హామీలు ఇచ్చి ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. మొదటగా ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకున్న వారికి తనవంతుగా 10,116 అందిస్తానని ఆయన తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి తమ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, మహిళా అధ్యక్షురాలు లక్కిడి నరసవ్వ, యామాపూర్ పిఎసిఎస్ చైర్మన్ అంకతి రాజన్న నాయకులు దూదిగాం గంగాధర్, భాస్కర్‌రెడ్డి, పెంట లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేత జువ్వాడి నర్సింగరావు

విద్యార్థికి ఆర్థిక సహాయం

జగిత్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ఎంబీబీఎస్ విద్యార్థి దుర్గం రంజిత్‌కు ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సూరజ్ శివ శంకర్ రూ.12 వేలు ఆర్థిక సహాయం అందించాడు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం రాయపేట గ్రామంలో కూలి పని చేసుకుంటున్న దుర్గం కిష్టయ్య-చిన్నక్క దంపతులు కుమారుడైన రంజిత్ 2023-24 నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో ప్రతిభ కనబరచి హైద్రాబాద్‌లోని ఉస్మానియా వైద్య కళాశాలలో సీటు సంపాదించాడు. ఎంబీబీఎస్ తొలి సంవత్సరంలో ప్రతిభ కనబరచి మంచి మార్కులు సాధించాడు. రెండవ సంవత్సరం పుస్తకాలు, హాస్టల్ ఫీజు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని తెలుసుకున్న జగిత్యాలకు చెందిన సూరజ్ శివ శంకర్ స్పందించి హైద్రాబాద్ వెళ్లి విద్యార్థి రంజిత్‌కు ఆర్థిక సహాయం అందజేశాడు. ఎంబీబీఎస్ కోర్సును పూర్తి చేసి నిరుపేదలకు ఉచిత వైద్య సేవలను అందించాలని రంజిత్‌కు సూచించారు.

ఆలయంలో పల్లకి సేవ

జగిత్యాల క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న శ్రీ ధన్వంతరీ సూర్య భగవాన్ ఆలయంలో జేష్ఠ మాసం కృష్ణ మాసాన్ని పురస్కరించుకుని భక్తుల ఆధ్వర్యంలో స్వామి వారలకు పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, సత్సంగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజన్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

-జగిత్యాల వాసవి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పబ్బ శ్రీనివాస్



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న వాసవి ట్రస్ట్ నిర్వాహకులు

జగిత్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలని అప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని జగిత్యాల వాసవి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పబ్బ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాలులో వాసవి ట్రస్ట్ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సర జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య ప్రతిభా పురస్కార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇంటర్, పదో తరగతి పరీక్షలల్లో అత్యధిక మార్కులు సాధించిన 120 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ సంవత్సరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తూ ప్రోత్సాహం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ కన్వీనర్, రా రైస్ మిల్లర్ల జిల్లా అధ్యక్షుడు మైలారపు రాంబాబు, నాయకులు బసవా శ్రీనివాస్, బుస్సా దశరథం, కండ్ల మధుకర్, గుండా కార్తిక్, కొత్త సురేశ్, అల్లాడి ప్రవీణ్, కొత్త వేణుగోపాల్, రాజేశుని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గం

రాయికల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామ అంబేద్కర్ యువజన సంఘం (మాదిగ) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షునిగా మారంపెల్లి రవి కుమార్, ఉపాధ్యక్షులుగా తడగొండ లక్ష్మణ్, తడగొండ పోశాలు, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పాలనపై కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనపై ఆదివారం బీజేపీ నాయకులు పలు గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. వికసిత్ భారత్ అమృత్‌కాల్‌కు సంబంధించిన కరపత్రాలను పలువురికి అందజేశారు. 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాల గురించి కరపత్రాల్లో ప్రచురించారు. ప్రపంచం గర్వించే స్థాయిలో పాలన సాగిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, మాజీ మండల అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, కాశోజీ ప్రతాప్, కొడిపల్లి అనిల్‌రెడ్డి, తాలుకా మల్లేశ్, మల్యాల సురేశ్ తదితరులు ఉన్నారు.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం

మల్యాల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం మండల శాఖ నూతన కార్యవర్గంను ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లంబాడిపల్లికి చెందిన మరాటి సత్యయ్య, గౌరవ అధ్యక్షునిగా నెల్ల రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెలగొండ గంగాధర్, దిండు ప్రవీన్, కోశాధికారిగా మరాఠి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రౌతు రవి, నులుగొండ సురేశ్, సంయుక్త కార్యదర్శులుగా దొనకంటి గంగాధర్, గాండ్ల మల్లేశం, ముదాం మల్లేశం, సలహాదారుగా కొల్లూరి గంగాధర్, మీడియా కన్వీనర్‌గా వంగల రమేశ్, ప్రచార కార్యదర్శిగా ముద్దం శ్రీనివాస్‌ను సంఘ సభ్యులు ఎన్నుకున్నారు.

నేడు జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటన

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటించనున్నట్లు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జగిత్యాల రూరల్ మండలం పొలాసలో ఓ ప్రైవేటు పాఠశాల ప్రారంభం, 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఓ ప్రైవేటు వస్త్రాలయం ప్రారంభం, ఉదయం 11గంటలకు జగిత్యాలలో నవదుర్గ ఆలయాన్ని సందర్శిస్తారని ప్రకటించారు. జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్, తెలంగాణ జాగృతి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డిప్యూటీ సీఎంను కలిసిన జగిత్యాల నేతలు

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన టీపీసీసీ సేవాదళ్ సెక్రటరీ బాగోజి ముఖేష్ ఖన్నా కలిశారు. హైద్రాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రాయికల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధికి పీఎంజీఏటీ పథకం కింద మండలంలోని దావన్‌పెల్లి గ్రామాన్ని ఎంపిక చేయడం పట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు బలరాం నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఎంపీ ధర్మపురి అర్వింద్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ పథకం కింద గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గంగాధర్ నాయక్, ఉప సర్పంచ్ బిక్కు నాయక్, మండల ఎస్టీ మోర్చా అధ్యక్షుడు తిరుపతి నాయక్, గ్రామ ఉపాధ్యక్షుడు రవి, సీనియర్ నాయకులు రాజు నాయక్, రాజు, గంగన్న, దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం నేత భూమేశ్వర్‌కు నివాళి

ధర్మపురి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మున్నూరుకాపు సంఘం నాయకులు ఒద్నాల భూమేశ్వర్ సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ సంతాప సభ పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ప్రధాన కార్యదర్శి బండారి లక్ష్మణ్, వ్యవస్థాపక అధ్యక్షులు బండి మురళి, మాజీ అధ్యక్షులు సంగి నర్సయ్య, సంగి లక్ష్మీనర్సయ్య, సంగి శేఖర్, కాశెట్టి రాంబాబు, ఒద్దాల మల్లేశం, సోమిశెట్టి శేఖర్, ఒద్నాల రాజన్న, బండారు సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతు వేదికలో సీఎం సందేశం

కొడిమ్యాల, జూన్15(ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం రైతులకు సందేశం ఇస్తారని రైతు వేదికలలో అన్నదాతలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఏవో పి.జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1031 రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందన్నారు. మండలంలోని రైతులు తిర్మలాపూర్, కొడిమ్యాల, పూడూర్ రైతు వేదికలలో ప్రసారమయ్యే ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఏవో కోరారు.

డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

మల్లాపూర్, జూన్, 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్య ఉండి రాష్ట్రా అభివృద్ధికి కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఆయురోగ్యలతో ఉంటు రాష్ట్రానికి ఆయన మరింత సేవలు అందించాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పుంద్ర శ్రీనివాస్‌రెడ్డి, ఎల్క కమలాకర్, మరిపెల్లి మల్లయ్య, ఎర్ర భూమయ్య, బండారి రమేష్, కొంపల్లి రాకేష్, రామ, లక్ష్మణ్, నూతిపెల్లి రాజం, గోపిడి శేఖర్‌రెడ్డి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

●కోరుట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మల్లు జన్మదిన వేడుకలను ఆదివారం అంబేడ్కర్ సంఘ నాయకులు నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రత్యేకంగా తయరు చేసిన కేకు కట్టు చేసి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లక్ష్మినారాయణ,అంబేడ్కర్ సంఘ నాయకులు బలిజ రాజిరెడ్డి, ఉయ్యాల నర్సయ్య, బద్ది మురళి, ఉయ్యాల శోభన్, పసుల కృష్ణప్రసాద్, పోట్ల లక్ష్మణ్, గోరుమంతుల సత్తయ్య, సామల వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు సామగ్రి అందజేత

బీర్‌పూర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మనబడి పథకం ద్వారా 43 డ్యూయల్ డెస్కులను బేంచీలను అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ తెలిపారు. వచ్చిన 43 డెస్కులలో టైప్ వన్ గ్రీన్ కలర్ 11, టైప్ వన్ బ్లూ కలర్ 11, టైప్ టూ బ్లూ కలర్ 21 వచ్చాయని తెలిపారు. ఈ డెస్కులు ద కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ నుండి వచ్చాయాని పేర్కొన్నారు.

రైతు వేదికలకు రక్షణ కరువు

-దొంగల పాలవుతున్న విలువైన వస్తువులు

కొడిమ్యాల, జూన్15 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని నాలుగు రైతు వేదికలకు రక్షణ కరువై వాటిలో ఉన్న విలువైన వస్తువులు దొంగల పాలవుతున్నాయి. గత ప్రభుత్వం 20 లక్షల రూపాయలతో కొడిమ్యాల, పూడూర్, నల్లగొండ, తిర్మాలాపూర్ గ్రామాల శివారుల్లో రైతులు సమావేశాలను నిర్వహించుకోవటానికి రైతు వేదికలను నిర్మించింది. 2023 డిసెంబరులో మండలంలోని తిర్మలాపూర్ గ్రామ శివారులో ఉన్న రైతు వేదిక తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని లైట్లు, ఫ్యాన్లు, వాష్ రూం డోర్‌ను ఎత్తుకుపోయారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ గ్రామ శివారులో నిర్మించిన రైతు వేదిక మందు బాబులకు అడ్డాగా మారినా పట్టించుకున్న వారు లేరు. మండల కేంద్రంలోని రైతు వేదికకు, తిర్మాలాపూర్ రైతు వేదికకు ఇటీవల ప్రభుత్వం 3లక్షల రూపాయల విలువైన వీసీ యూనిట్లను మంజూరు చేసింది. కొడిమ్యాలలో వీసీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన రెండు రోజులకు ఇన్‌స్టాల్ చేయక ముందు 30వేల రూపాయల విలువ గల స్పీకర్లను గత నెల 28న రైతు వేదిక కిటికీ తలుపులు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకు పోయారు. చోరీపై ఏవో పి.జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు దృష్టి సారించి రైతు వేదికల రక్షణకు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.



దొంగలు పగులగొట్టిన రైతువేదిక తలుపు

ప్రభుత్వం రక్షణ కల్పించాలి

-జ్యోతి, మండల వ్యవసాయ అధికారి



మండలంలోని నాలుగు రైతు వేదికలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. కొడిమ్యాల, తిర్మాలా పూర్‌లోని రైతు వేదికలలో జరిగిన దొంగతనాలలో ప్రభుత్వం నిందితులను గుర్తించాలి. రైతు వేదిక ఆస్తులను కాపాడటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

తరగతి గదుల్లోకి వర్షపు నీరు

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

మల్యాల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం నిర్మించిన ఆ పాఠశాల పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా మారి వర్షానికి తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. కొన్నేళ్ల క్రితమే దాన్ని తొలగించాలని విద్యాశాఖకు తీర్మానాలు వెళ్లాయి. అయితే అక్కడ ఐదు గదుల నిర్మాణానికి గతంలో నిదులు కేటాయించగా అవి విడుదల చేయక పోవడంతో గదుల నిర్మాణం అట్టకెక్కింది. దీంతో శిథిల భవనంలోనే తరగతులు కొనసాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గతేడాది ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద తొలగించే పోతారం జడ్పీ హైస్కూల్‌లోనూ రూ.8లక్షలతో మరమ్మతు పనులు చేపట్టారు. అయితే భవనం పూర్తిగా కూలి పోచే దశకు చేరకోవడంతో మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం అంతంత మాత్రంగానే మారిందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షంతో భవనంపై నీరు నిలిచి కింద గల తరగతి గదులకు నీరు వస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయమై ఎంఈవో ఎన్.జయసింహరావును సంప్రదించగా తరగతి గదులలోకి వర్షపునీరు రావడంతో విద్యార్థులకు అసౌకర్యంగా మారిందన్నారు. గతంలో నూతన భవన నిర్మాణానికి తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈవో తెలిపారు.



తరగతి గదిలోకి చేరిన వర్షపు నీరు

ఘనంగా పెద్దమ్మ పండుగ

ఇబ్రహీంపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం పెద్దమ్మ పండుగ ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా కాలినడకన డప్పుచప్పులతో సమీప రాట్నాల మడుగు గోదావరి నదికి వెళ్లి గంగా జలాలు తీసుకువచ్చి స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయం నుండి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద మనుషులు, పెద్దమ్మ గుడి పూజారిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్ట్‌లు ప్రదానం

మెట్‌పల్లిటౌన్,జూన్ 15(ఆంధ్రజ్యోతి): తైక్వాండో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆదివారం పట్టణంలోని మెట్‌పల్లి క్లబ్ ప్రాంగణంలో బెల్టు, సర్టిఫికెట్‌లను నిత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తైక్వాండో శిక్షణ నేర్చుకోవడం ద్వారా క్రమశిక్షణ, మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉంటారని దీనివల్ల భవిష్యత్తులో ఉద్యోగాల శిక్షణ వీరికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.ట్రైనర్స్ యొక్క సలహాలు సూచనలు తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా తైక్వాండో అధ్యక్షులు గంగ రావు, రాష్ట్ర రిఫరీ, ట్రెజరీ మెంబర్ జగిత్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ సంతోష్, మెట్‌పల్లి ప్రెసిడెంట్ ఎండి.యాసిన్, మాస్టర్ తైక్వాండో అధ్యక్షులు అజయ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు

మెట్‌పల్లిటౌన్,జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు దొమ్మటి ప్రవీణ్ అన్నారు. ఆదివారం ఆలయంలో కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే ఉత్సవాలు నేపథ్యంలో పలు పూజా కార్యక్రమాల విధి విధానాలను చర్చించుకున్నారు. అనంతరం నిత్య పూజ నిధి ఏర్పాటు కోసం దాతల సహకారంతో ఆలయానికి నిధి సమకూర్చేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.